సాక్షి
సిద్దిపేట
గురువారం । 6 । జూలై । 2023



పోలీసుల వలయంలో గజ్వేల్
పట్టణంలోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి జరిగిన అవమానం తర్వాత తలెత్తిన ఉద్రిక్త పరిస్థితులను కట్టడి చేసేందుకు పోలీస్‌శాఖ తగిన చర్యలు తీసుకుంటోంది. 8లో..



జోరు వర్షం.. రైతన్న హర్షం
జిల్లాలో భారీ వర్షం కురిసింది. బుధవారం కురిసిన వానకు వాగులు వంకలు పొంగి పొర్లాయి. జిల్లా వ్యాప్తంగా 1552.2 మి.మీ వర్షపాతం నమోదైంది. 9లో..

సైనిక్ కళాశాలకు చేబర్తి విద్యార్థిని



మర్కూక్(గజ్వేల్): మండలంలోని చేబర్తి గ్రామానికి చెందిన విద్యార్థిని చాట్లపల్లి రజని(16)కి బీజీనగర్ సైనిక్ కళాశాలకు ఎంపికైంది. కాలేజీలో సీటు రావడంపై ఆమెను గ్రామస్తులు అభినందించారు. రజని చిన్నప్పుడే తండ్రి చనిపోయాడు.

న్యూస్‌రీల్

తెలంగాణలో బీజేపీకి అధికారం కలనే

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



విద్యార్థులను సన్మానిస్తున్న ఎంపీ

దుబ్బాకటౌన్: బీజేపీ ఎన్ని డ్రామాలు ఆడినా తెలంగాణలో అధికారంలోకి వచ్చేది కలనే అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాకలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో బీజేపీ కార్యకర్తలు దుద్దెడ లక్ష్మి, దుద్దెడ సుగుణతో పాటు సుమారు 50 మంది మహిళలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ సాధిస్తుందన్నారు. బీజేపీ ఎత్తుగడలు వికటించడంతో ఏం చేయాలో తోచక అధ్యక్షుడిని మార్చిందన్నారు. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో ఎమ్మెల్యే రఘునందన్‌రావు కొత్త డ్రామాలు ఆడుతున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, ఎంపీపీ పుష్పలత కిషన్‌రెడ్డి, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు దేవుని లలిత, ఎంగారి స్వప్న ఉన్నారు. దుబ్బాక మండలం నుంచి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన 13 మంది విద్యార్థులను ఎంఈఓ ప్రభుదాసుతో కలిసి ఎంపీ సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పుల్లని వేణు అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కార్ బడుల్లో స్కావెంజర్స్, ఉపాధ్యాయులు, శాశ్వత మండల విద్యాశాఖ అధికారులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గడిపే సుజిత్, ఎర్రొళ్ల అఖిల్, ఎట్టబోయిన మురళి పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్‌కు ప్రవేశ పరీక్ష

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీసర్కిల్‌లో ఇవ్వనున్న సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ (పది నెలలు, రెసిడెన్షియల్) ఉచిత కోచింగ్ కోసం ప్రవేశ పరీక్ష ఈ నెల 9న నిర్వహించనున్నట్లు ఎస్సీ స్టడీసర్కిల్ డైరెక్టర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్‌టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. రాత పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

ఆర్టీసీ సిబ్బందికి స్పెషల్ చాలెంజ్ అవార్డులు



కండక్టర్‌కు ప్రశంస పత్రాన్ని అందిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న సిబ్బందికి స్పెషల్ చాలెంజ్ పేరిట ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉత్తమ అవార్డులు అందజేశారు. దసరా, సంక్రాంతి పండగలకు సంస్థ ఇచ్చిన చాలెంజ్‌ను స్వీకరించి సిద్దిపేట డిపోలో పనిచేస్తున్న కండక్టర్లు రాజయ్య, ఎండీ అఫ్సర్ సిద్దిపేట డిపోకు అత్యధిక ఆదాయం తీసుకువచ్చినందుకు హైదరాబాద్‌లోని కళాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ వారిని అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేసినట్లు సిద్దిపేట డిపో మేనేజర్ బుధవారం తెలిపారు.

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్

సిద్దిపేటకమాన్: పోలీస్ కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ శ్వేత తెలిపారు. జూలై 13వ తేదీ వరకు నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, సమావేశాలు, సభలు నిర్వహించరాదని సూచించారు. సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కొనసాగుతాయని సీపీ పేర్కొన్నారు.

పురస్కారమే లక్ష్యంగా..

- స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డు రేసులో 15 గ్రామ పంచాయతీలు
- స్వచ్ఛత చాటేందుకు కసరత్తు
- మూడు గ్రామాలకు ఒక ప్రత్యేకాధికారి నియామకం
- ఆగస్టులో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పరిశీలన



జగదేవ్‌పూర్ గ్రామ పంచాయతీకి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం

సాక్షి, సిద్దిపేట: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ-2023లో సత్తాచాటేందుకు గ్రామ పంచాయతీలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని అన్ని గ్రామాలు ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా ఎంపికయ్యాయి. అభివృద్ధికి దోహదపడే పలు అంశాలను పరిగణలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం అందించే అవార్డు సాధనే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 15 గ్రామాలను ఎంపిక చేశారు. వాటికి ప్రత్యేకాధికారులను నియమించారు. ఆగస్టులో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 బృందం గ్రామాలను సందర్శించనుంది.

జనాభా వారీగా గ్రామాల ఎంపిక

- జిల్లా వ్యాప్తంగా 499 గ్రామ పంచాయతీలుండగా.. జనాభా వారీగా అవార్డు ఎంపిక కోసం గ్రామాలను ఎంపిక చేశారు. మూడు విభాగాలుగా 2వేల లోపు, 2001 నుంచి 5వేల వరకు, 5వేలకు పైగా జనాభా విభజించారు.
- ఒక్కో విభాగంలో మొదటి ఐదు గ్రామాల చొప్పున మూడు కేటగిరిలలో 15 గ్రామాలను ఎంపిక చేశారు.

కసరత్తు ప్రారంభించాం



స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 అవార్డు ఎంపిక అయ్యేందుకు కసరత్తు ప్రారంభించాం. ఇందుకోసం జిల్లాలోని జనాభా వారీగా 15 గ్రామాలను ఎంపిక చేసి వాటికి ప్రత్యేకాధికారులను నియమించాం. వారితో జిల్లా అదనపు కలెక్టర్ ముజామిల్ ఖాన్ సమావేశమయ్యారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సత్తా చాటేందుకు ప్రజలు సహకరించాలి. – దేవికి దేవి, డీపీఓ

గ్రామాలకు ప్రత్యేక అధికారులు

- స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పరిశీలించే గ్రామాలకు ప్రత్యేకాధికారులను జిల్లా యంత్రాంగం నియమించింది. అవార్డుకు ఎంపికయ్యేందుకు వివిధ అంశాలను క్షేత్రస్థాయిలో ప్రత్యేకాధికారులు పర్యవేక్షించనున్నారు. ఒక్కో అధికారికి మూడు గ్రామాల చొప్పున ఐదుగురు ప్రత్యేకాధికారులను నియమించారు. అడిషనల్ డీఆర్‌డీఓ కౌసల్య దేవి, గజ్వేల్ డీఎల్‌పీఓ వేదవతి, సిద్దిపేట డీఎల్‌పీఓ మల్లికార్జున్, ఏపీడీలు ఓబులేష్, రవీందర్‌ను కలెక్టర్ నియమించారు.
- ఆయా గ్రామాలు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 అవార్డుకు ఎంపికయ్యే విధంగా కసరత్తు చేపట్టారు.
- ఎంపిక చేసిన గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, ఇంటింటా మరుగుదొడ్డి, వాటి నిర్వహణ(రెండు సెప్టిక్ ట్యాంకుల ఏర్పాటు), ఇంకుడు గుంతల నిర్మాణం, ప్రతి ఇంటి నుంచి తడి పొడి చెత్త సేకరణ, కిచెన్ గార్డెన్, కంపోస్ట్ షెడ్డు నిర్వహణ, ప్లాస్టిక్ నివారణపై చర్యలు తదితర 50 అంశాలను పరిశీలించనున్నారు.
- స్వచ్ఛ సర్వేక్షణ్ బృంద సభ్యులు ఆగస్టు నెలలో గ్రామాలను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. దీంతో ఈ నెల రోజుల పాటు ప్రత్యేకాధికారులు ప్రతి రోజూ గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తారు. నిత్యం రిపోర్టును జిల్లా యంత్రాంగానికి అందించాలి.

ఎంపికైన గ్రామాల వివరాలు

జనాభా	గ్రామాలు	జనాభా
2వేల జనాభా కంటే తక్కువ	రామునిపట్ల (చిన్న కోడూరు)	2,000
	తునికిబొల్లారం (ములుగు)	1,990
	సిద్ధన్నపేట (నంగనూరు)	1,990
	దమ్మక్కపల్లి (కొండపాక))	1,970
	ఎర్రవల్లి (మర్కూక్)	1,925
2001 నుంచి 5వేల జనాభా	భూంపల్లి (అక్బర్‌పేట-భూంపల్లి)	4,880
	కడవేర్గు (చేర్యాల)	4,695
	వర్గల్	4,195
	తడ్కపల్లి (సిద్దిపేట అర్బన్)	4,405
	పుల్లూరు (సిద్దిపేట రూరల్)	4,175
5వేల కంటే ఎక్కువ	నంగనూరు	10,155
	జగదేవ్‌పూర్	6,715
	జక్కాపూర్(నారాయణరావుపేట)	6,640
	నారాయణరావుపేట	6,595
	ఆకునూరు (చేర్యాల)	6,120



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

ఎన్నికల నిబంధనలపై అవగాహన ఉండాలి

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియపై మండల స్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల కోడ్ వచ్చే లోపు ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూం భద్రత, ఈవీఎంల చెకింగ్, ఎన్నికల ప్రక్రియలో సాంకేతికత గురించి సంపూర్ణంగా తెలుసుకోవాలని సూచించారు. నియోజకవర్గాల్లోని పోలింగ్ స్టేషన్ల పూర్తి సమాచారం కలిగి ఉండాలన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ప్రతి ఓటర్ వివరాలను సేకరించాలన్నారు. ఆర్డీఓలు తహసీల్దార్, బీఎల్‌ఓలతో సమావేశాలు నిర్వహించి 100 నుంచి 80 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు ఉన్న ఓటర్ల వివరాలను సేకరించాలన్నారు. వచ్చే సమావేశానికి పూర్తి వివరాలతో రావాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ లక్ష్మీకిరణ్, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీఓలు రమేష్ బాబు, విజేందర్ రెడ్డి, బెన్ సాలమ్ పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో సృజనాత్మకతను ప్రోత్సహించడానికి ఇంటింటా ఇన్నోవేటర్ కోసం జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ విడత కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం ద్వారా గుర్తించిన ఐదు ఆవిష్కరణలను స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో ప్రదర్శనకు ఉంచనున్నట్లు తెలిపారు. ఆవిష్కరణకు సంబంధించిన ఆరు వాక్యాలు, రెండు నిమిషాల వీడియో, నాలుగు ఫొటోలు, ఆవిష్కర్త పేరు, ఫోన్ నెంబర్, వయసు, వృత్తి, గ్రామం పేరు, జిల్లా పేరు వంటి వివరాలు 9100678543కి వాట్సాప్ చేయాలన్నారు. దరఖాస్తులను ఆగస్టు 5వ తేదీ లోపు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈడీఎం ఆనంద్, టీఎస్ఐసీ జిల్లా కో ఆర్డినేటర్లు హర్షిత్, మనిదీప్ పాల్గొన్నారు



ఇంటింటా ఇన్నోవేషన్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి



కోహెడ మండలంలో పర్యటిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

కోహెదరూరల్(హుస్నాబాద్): అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు, పెన్షన్ ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని నారాయణపూర్, విజయనగర్‌కాలనీ, గొట్టమిట్ల, వింజపల్లి, రాంచంద్రాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. పేదలకు ఇళ్లు, స్థలాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మంజు గోపి, జిల్లా కార్యవర్గ సభ్యులు కనుకుంట్ల శంకర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ననువాల ప్రతాప్‌రెడ్డి, సీపీఐ మండల సహాయ కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

ముంపు బాధితుల ఎదురుచూపు

సిద్దిపేటజోన్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తొగుట మండలం పల్లె పహాడ్ గ్రామ ముంపు బాధితులు బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్దకు వచ్చారు. భూ పరిహారానికి సంబంధించిన ప్యాకేజీ సమస్యలను పరిష్కరించాలని కోరడానికి సుమారు 100 మంది అధికారుల కోసం వేచి ఉన్నారు. అంతా మంత్రి పర్యటనలో ఉండడంతో రాత్రి వరకు వేచి చూసి నిరాశగా వెనుదిరిగారు.

పథకాల అమలులో ఉద్యోగులు కీలకం

టీఎన్‌జీఓ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్

హుస్నాబాద్ రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగులు కీలక పాత్ర వహిస్తారని, వారితోనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన టీఎన్‌జీఓ హుస్నాబాద్ డివిజన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ఆంధ్ర రాష్ట్రంలో విలీనం కాకముందు నుంచే టీఎన్‌జీఓ ఉందని, అప్పటి నుంచి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ ఉద్యోగులు ప్రజలకు ఉత్తమ సేవలందించి జిల్లా స్థాయిలో పేరు తీసుకురావాలన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. హుస్నాబాద్ డివిజన్ అధ్యక్షునిగా పరుశరాములు, ప్రధాన కార్యదర్శిగా జి.మోహన్, సహాయ కార్యదర్శి జనగామ రవీందర్‌రావు, కోశాధికారి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి విక్రమ్ రెడ్డి, అశోక్, అహ్మద్, కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్యాదరి పరమేశ్వర్

మోదీ, కేసీఆర్ ఇద్దరూ తోడు దొంగలే

ఆలిండియా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్



మాట్లాడుతున్న బీవీ శ్రీనివాస్, పక్కన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తదితరులు



బైక్ ర్యాలీ తీస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

వర్గల్(గజ్వేల్): తెలంగాణలో సీఎం కేసీఆర్, కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇద్దరూ తోడు దొంగలే అని ఆలిండియా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీవీ శ్రీనివాస్, మాజీ పీసీసీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి విమర్శించారు. బుధవారం వర్గల్ మండలం అవుసులోనిపల్లి వద్ద భూనిర్వాసిత రైతుల దీక్షకు మద్దతు పలికారు. అక్కడి నుంచి తెలంగాణ యూత్ కాంగ్రెస్ యువ పోరాట యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఆకాంక్షలు, హామీలు విస్మరించిన సీఎం కేసీఆర్‌ను గద్దె దింపడమే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ శ్రేణులు అహరహం శ్రమించాలని పిలుపునిచ్చారు. పేదల ఆర్థికాభ్యున్నతికి ఇందిరమ్మ భూములు పంపిణీ చేస్తే సీఎం కేసీఆర్ వాటిని లాక్కొని వ్యాపారం చేస్తున్నాడని మండిపడ్డారు. తాము అధికారంలోకి రాగానే అవినీతి, అక్రమాలకు పాల్పడిన సీఎం కేసీఆర్, మంత్రులపై విచారణ జరిపి చర్లపల్లి జైలుకు పంపుతామన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశాయన్నారు. ఉద్యోగాల భర్తీ, మూడెకరాల భూ పంపిణీ తదితర అనేక హామీలను విస్మరించారని దుయ్యబట్టారు. ఇంటికో ఉద్యోగం మాటెలా ఉన్నా.. ఊరుకో ఉద్యోగం కూడా ఇవ్వలేదని, వారి కుటుంబంలో మాత్రం అందరికీ పదవులు లభించాయని ఎద్దేవా చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల మంజూరి, దళిత బంధు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్, రైతు రుణమాఫీ తదితర హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు ఖర్గే ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ అధికారం చేపట్టగానే రైతు డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్ అమలు చేస్తుందని స్పష్టం చేశారు. బీజేపీ, భారాస పాలనలో చోటుచేసుకున్న అక్రమాలను, అన్యాయాలను ఈ రోజు నుంచే యువజన కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రమోద్ కుమార్, ఉపాధ్యక్షులు ఎమ్మార్పీ వినోద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, పార్లమెంట్ ఇంచార్జి జగదీశ్వరరావు, నాయకులు శ్రవణ్, సందీప్ రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంటిమామిడి నుంచి బైక్ ర్యాలీ

ములుగు(గజ్వేల్): తెలంగాణ యూత్ కాంగ్రెస్ యువ పోరాట యాత్రలో భాగంగా సిద్దిపేట జిల్లా సరిహద్దు గ్రామమైన వంటిమామిడి నుంచి ఆ పార్టీ శ్రేణులు బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వంటిమామిడి రాజీవ్‌రహదారి మీదుగా ప్రారంభమైన ర్యాలీ వర్గల్ వరకు సాగింది. కాగా వంటిమామిడి వద్ద నేతలకు స్వాగతం పలికే సమయంలో కార్యకర్తల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. అనంతరం వివాదం సద్దుమనగడంతో ర్యాలీ యథావిధిగా కొనసాగింది.

మల్లన్న ఆశీస్సులతో ప్రాజెక్టు పూర్తి

- రాష్ట్ర ఆర్థిక, వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావు
- రూ.12 కోట్లతో ఆలయ క్యూకాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ



క్యూ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామివారి ఆశీస్సులతో అతిపెద్ద ప్రాజెక్టు మల్లన్నసాగర్ పూర్తయిందని రాష్ట్ర ఆర్థిక, వైద్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో రూ.12 కోట్లతో చేపట్టిన క్యూకాంప్లెక్స్ నిర్మాణానికి జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. అంతకు ముందు మంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. పట్టాలు వేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మల్లన్న సాగర్ నిర్మాణం పూర్తిచేసి సీఎం కేసీఆర్ ఆ నీటితో స్వామివారి పాదాలు కడిగినట్లు గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాతే ఆలయాలకు మహర్దశ పట్టిందన్నారు. కొమురవెల్లిలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు భక్తులకు కనీస వసతులు ఉండేవి కాదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత రూ.36 కోట్లతో ఆలయం వద్ద వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేశారని, ఈరోజు అది రాష్ట్రానికే కల్పతరువుగా మారిందన్నారు. కల్యాణోత్సవంలో ఇచ్చిన హామీ మేరకు స్వామి వారికి బంగారు కిరీటం, వెండి దర్వాజలు చేయించినట్లు వెల్లడించారు. రానున్న రోజులలో దేవాలయ ఆవరణలో 100 వసతి గదులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. స్వామి వారి మొక్కు తీర్చుకునేందుకు వచ్చిన సమయంలో సీఎం ఇచ్చిన హామీ మేరకు రాజీవ్ రహదారి నుంచి ఆలయం వరకు రూ10.30 కోట్లతో డబుల్‌లైన్ రోడ్డు పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. మల్లన్న ఆలయ సంవత్సర ఆదాయం రూ.18 కోట్లకు చేరడం విశేషమన్నారు. దాసరం గుట్టపై త్వరలో వసతి గదులు నిర్మిస్తామని వెల్లడించారు. మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయ భవనాలతోపాటు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీపీ తలారి కీర్తన మంత్రికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, గ్రామ సర్పంచ్ సార్ల లత, ఆలయ ఈఓ బాలాజీ, ఏఈఓలు అంజయ్య, శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి

బటర్‌ఫ్లై లైట్లు ప్రారంభం

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని దుద్దెడ శివారులో గల సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయం నుంచి పోలీస్ కమిషనరేట్ కార్యాలయం వరకు రాజీవ్ రహదారిపై డివైడర్ వెంబడి ఏర్పాటు చేసిన బటర్‌ఫ్లై లైట్లను బుధవారం రాత్రి 10 గంటలకు మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించారు. రూ.45 లక్షల ఆర్‌అండ్‌బీ శాఖ నిధులతో నిర్మించిన 36 బటర్ ఫ్లై స్ట్రీట్ లైట్లు, 3 హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా అదనపు కలెక్టరు శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఫైజాన్ హైమద్, డీఆర్వో లక్ష్మి కిరణ్ పాల్గొన్నారు.



బటర్‌ఫ్లై లైట్లను ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట బల్దియాకు రూ. కోటి వితరణ

సిద్దిపేటజోన్: పట్టణంలో హరితహారం నిర్వహణ, నీటి వసతి, సిబ్బందికి జీతాలు తదితర అవసరాల కోసం ఐటీసీ సంస్థ సిద్దిపేట మున్సిపాలిటీకి సీఎస్ఆర్ కింద కోటి రూపాయలు ఇచ్చింది. ఈ మేరకు బుధవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి హరీశ్‌రావును ఐటీసీ సంస్థ ప్రతినిధులు శంకర్, ఉమాకాంత్ లు కలిసి మొదటి విడతగా రూ 50 లక్షల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి..



రామాయంపేట(మెదక్): మండలంలోని ఝాన్సీ లింగాపూర్ గ్రామ శివారులో మంగళవారంరాత్రి కొందరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులో ఉన్న కాపర్ కాయిల్స్ చోరీ చేశారు. ఏబీ స్విచ్ ఆఫ్ చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను స్తంభం పైనుంచి కిందపడేశారు. బుధవారం ఉదయం రైతులు వ్యవసాయ బోర్లవద్దకు వెళ్లి గమనించారు. జరిగిన ఘటనను అధికారులకు వివరించారు. ఏఈ పెంట్యానాయక్, ఎస్‌ఐ రంజిత్ సంఘటనాస్థలి వద్దకు చేరుకొని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో హెల్పర్‌కు తీవ్రగాయాలు

నంగునూరు(సిద్దిపేట): స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా, కరెంట్ సరఫరా కావడంతో హెల్పర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం తెల్లవారుజామున వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అప్పలాయిచెర్వు వెళ్లే దారిలో స్తంభంపై సమస్యను గుర్తించి జేఎల్‌ఎం బిక్షపతి రాంపూర్ సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకున్నాడు. హెల్పర్‌గా పనిచేస్తున్న రేపాక పోశిరెడ్డిని స్తంభం ఎక్కించాడు. మరమ్మతులు చేస్తున్న క్రమంలో స్తంభానికి విద్యుత్ సరఫరా కావడంతో పోశిరెడ్డి తొడ, వీపు భాగం కాలిపోడవడంతో కిందపడి, తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షల అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మంత్రి హరీశ్‌రావు మెరుగైన చికిత్స అందించాలని ఫోన్‌లో వైద్యులకు సూచించారు.

ఆలయంలో చోరీ

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయంలో దొంగలు పడ్డారు. స్థానికులు, యాదవ సంఘం అధ్యక్షుడు ఉడెపు కృష్ణయాదవ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయ తలుపులు పగులకొట్టి ఎల్లమ్మ విగ్రహంపై ఉన్న బంగారు పుస్తె, వెండి మట్టెలు, వెండి పాకాణాలు, పంచలోహ విగ్రహాలు దొంగలించారన్నారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

బైక్ ..

శివ్వంపేట(నర్సాపూర్): కిరాణం డబ్బ వద్ద నిలిపి ఉంచిన బైక్‌ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మడిదల గ్రామానికి చెందిన తలారి హరిబాబు అనంతారం చౌరస్తా వద్ద కిరాణం డబ్బా నడుపుతున్నాడు. సోమవారం రాత్రి కిరాణం బైక్‌ని పార్క్ చేసి డబ్బాలో పడుకున్నాడు. తెల్లవారు జామున లేచి చూసేసరికి బైక్ కనిపించలేదు. దీంతో తన బైక్ కోసం పలు చోట్ల వెతికినా లభ్యం కాకపోవడంతో శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో హరిబాబు ఫిర్యాదు చేశాడు.

విద్యుత్ సామగ్రి అపహరణ

నిజాంపేట(మెదక్): కల్వకుంట గ్రామంలోని ప్రైవేట్ పాఠశాలలో దొంగలు చొరబడి పాఠశాలలోని విద్యుత్ సామగ్రి అపహరించారు. శ్రీవిద్యానికేతన్ స్కూల్ ఉపాధ్యాయుడు శ్యామ్ బుధవారం వచ్చి చూసే సరికి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి స్కూల్‌లోకి చొరబడి పాఠశాలలోని 2 ఫ్యాన్‌లు, సీసీ కెమెరాలను దొంగిలించిన్నట్లు గుర్తించాడు. శ్యామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ వేణుగోపాల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అనుమానాస్పదస్థితిలో ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం..రామచంద్రాపురం పట్టణంలోని సంగీత థియేటర్ సమీపంలోని రోడ్డు ఎదురుగా ఓషెడ్డు నిర్మిస్తున్నారు. అక్కడ గుర్తు తెలియని మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు. చనిపోయి నాలుగురోజులు కావొచ్చని, అనారోగ్యమే కారణం అయ్యి ఉండొచ్చని పోలీసులు తెలిపారు.

పోలీసుల వలయంలో గజ్వేల్

- పకడ్బందీగా చెక్‌పోస్టులు, పికెటింగ్‌లు
- సిటీ పోలీస్ యాక్ట్ అమలు
- పరిస్థితిని సమీక్షిస్తున్న డీఐజీ, సీపీ



ప్రజ్ఞాపూర్‌లో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

గజ్వేల్: పట్టణంలోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి జరిగిన అవమానం తర్వాత తలెత్తిన ఉద్రిక్తత పరిస్థితులను కట్టడి చేసేందుకు పోలీస్‌శాఖ తగిన చర్యలు తీసుకుంటోంది. సాధారణ పరిస్థితులను తీసుకురావడమే లక్ష్యంగా రాజన్న సిరిసిల్ల జోన్ డీఐజీ రమేశ్‌నాయుడు, సిద్దిపేట సీపీ శ్వేతల పర్యవేక్షణలో చెక్‌పోస్టులు, పికెటింగ్‌లు ఏర్పాటు చేశారు.

- ప్రజ్ఞాపూర్‌చౌరస్తా, తూప్రాన్ రోడ్డు వైపున వైజంక్షన్ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్ని తనిఖీ చేసిన తర్వాతే గజ్వేల్‌లోకి అనుమతిస్తున్నారు.
- ముట్రాజ్‌పల్లి, సంగాపూర్, పిడిచెడ్, కోటమైసమ్మ రోడ్లపై పికెటింగ్ కొనసాగుతోంది.
- సమస్యాత్మక ప్రదేశాలుగా గుర్తించిన చోటదారులను మూసేశారు. ప్రధాన రహదారిపై ప్రతీ బుధవారం జరిగే సంతను మరోచోటకు మార్చారు.
- పట్టణంలో సిటీ పోలీస్ యాక్ట్ అమల్లోకి తెచ్చి ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలపై నిషేధం విధించారు.
- వాట్సాప్ గ్రూపులు, ఇతర సోషల్ మీడియా ద్వారా గజ్వేల్ ఘటనపై రెచ్చగొట్టే పోస్టింగులను కట్టడి చేయడంపై దృష్టి పెట్టారు. గ్రూపుల్లో రెచ్చగొట్టే చాటింగ్‌లను ప్రోత్సహించవద్దని అడ్మిన్‌లకు సూచనలు చేశారు.
- వివిధ రకాల చర్యల ద్వారా గజ్వేల్‌లో ప్రశాంతత నెలకొనేలా చేయడంలో పోలీస్‌శాఖ సఫలమైంది. దీనివల్ల బుధవారం సాధారణ పరిస్థితులు కనిపించాయి.

ప్రశాంతతను దెబ్బతీస్తే చట్టప్రకారం చర్యలు: సీపీ శ్వేత

గజ్వేల్ పట్టణంలో ప్రశాంత పరిస్థితులు నెలకొన్నాయని, దీనిని దెబ్బతీయడానికి కొందరు సోషల్ మీడియా ద్వారా ప్రయత్నిస్తున్నారని, దీనిని సహించేది లేదని సిద్దిపేట సీపీ శ్వేత హెచ్చరించారు. బుధవారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం గజ్వేల్‌లో సిటీ పోలీసు యాక్ట్ అమల్లో ఉన్నదని, దీనివల్ల ఎలాంటి ఆందోళనలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదని స్పష్టంగా చెబుతున్నామని, గట్టి భద్రతా ఏర్పాట్లు సైతం కొనసాగుతున్నాయన్నారు. 3, 4 తేదీల్లో చోటుచేసుకున్న సంఘటనలకు సంబంధించి ఇప్పటివరకు 11మందిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు స్పష్టం చేశారు. గజ్వేల్‌లో పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చాయని, ఇదే రకమైన పరిస్థితులు కొనసాగేలా అన్నివర్గాల ప్రజలు సహకరించాలన్నారు.

చీకోటి ప్రవీణ్‌పై కేసు, మరో ముగ్గురి అరెస్ట్

ఎలాంటి అనుమతి లేకుండా మంగళవారం గజ్వేల్ పట్టణంలోకి ర్యాలీగా వచ్చారనే కారణంగా చీకోటి ప్రవీణ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అ విషయాన్ని బుధవారం వెల్లడించారు. కాగా సోమ, మంగళవారాల్లో పట్టణంలో చోటుచేసుకున్న సంఘటనలకు సంబంధించి గజ్వేల్ పట్టణానికి మహ్మద్ గౌస్, మహ్మద్ నహీమ్, సంగాపూర్‌కు చెందిన ఖదీర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు పోలీసులు తెలిపారు.

ఇది చెరువు కాదు..

పాపన్నపేట(మెదక్): చిన్నపాటి వర్షం పడితే చాలు... మండల పరిధిలోని కొడుపాక ఉన్నత పాఠశాల మైదానం చెరువులా మారుతుంది. దారి కూడా కనబడదు. పాఠశాల లోపలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సిందే. మన ఊరు–మనబడి కింద ఈ పాఠశాల ఎంపికైనా గ్రౌండ్ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. మంగళవారం కురిసిన వర్షానికి ఇలా తయారైంది. వేసవిలో ఈ గ్రౌండ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. లారీలు తిరగడంతో గ్రౌండ్ గుల్లగా మారింది. వర్షం పడటంతో బురదమయమైంది. దీంతో విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. మొరం పోసి చదును చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అదృశ్యమై.. ఆపై శవమై

ఝరాసంగం(జహీరాబాద్): అదృశ్యమైన వ్యక్తి కేసు విషాదాంతమైంది. పోలీసుల కథనం ప్రకారం.. జహీరాబాద్ పట్టణానికి చెందిన అహ్మద్(36) మార్బుల్ పనులు చేసేవాడు. ఈనెల 1న ఝరాసంగం మండల పరిధిలోని జునేగాంలో పని కొచ్చి అదృశ్యమయ్యాడు. 3వతేదీన ఝరాసంగం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందగా, పోలీసులు మిస్సింగ్ కేసుగా తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో జునేగాం నుంచి జహీరాబాద్ వెళ్తుండగా కుప్పానగర్ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాలతో మృతి చెందాడని పోలీసులు మంగళవారం సాయంత్రం గుర్తించారు. మృతుడి సోదరుడు అస్లాం ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అహ్మద్ (ఫైల్), సంఘటనా స్థలం వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ

జోగిపేటలో పట్టపగలే దొంగతనం

వట్‌పల్లి(అందోల్): జోగిపేట పట్టణంలో పట్టపగలు దొంగతనం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బెల్లంగొని ఏరియాలో నివాసముంటున్న ఎర్రగోళ్ల శ్యాంకుమార్ తన తల్లితో కలిసి మంగళవారం మధ్యాహ్నం పుల్కల్ మండలానికి పని నిమిత్తం వెళ్లాడు. అతని భార్య అనూష వ్యవసాయ పనులకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దుండగులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. పక్కనే ఉన్న బీరువా తాళాలు తీసుకొని అందులో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉండడంతో దొంగతనం జరిగినట్టు నిర్ధారణకు వచ్చారు. ఇంటి చుట్టుపక్కల ముగ్గురు మహిళలు, ఒక వ్యక్తి చిత్తు కాగితాలు ఏరుకుంటూ సంచరించినట్లు ఆ ఏరియాలో అమర్చిన సీసీ ఫుటేజీలో కనిపించినట్టు బాధితుడు తెలిపారు. వారే ఈ పని చేసినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దొంగతనం జరిగిన విషయమై బుధవారం జోగిపేట పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జయశంకర్ తెలిపారు.

వర్షానికి కూలిన పెంకుటిల్లు



దుబ్బాకటౌన్ : పట్టణంలోని 13వ వార్డు పరిధిలో బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి పెంకుటిల్లు కూలిపోయింది. అదృష్టవశాత్తు ఇంట్లో ఉన్నవారు క్షేమంగా బయటపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సీ కాలనీలోని గజ్జెల రాజయ్యకు చెందిన పెంకుటిల్లు వర్షానికి తడిసి ఒక్కసారిగా ముందు భాగంలో కుప్పకూలింది.పెద్ద శబ్దం రావడంతో నిద్రలోంచి లేచిన కుటుంబసభ్యులు భయంతో బయటకు పరుగుతీశారు.

కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు. మండల పరిధిలోని చండి గ్రామానికి చెందిన సాయిరెడ్డిని ఓ కేసు విషయంపై బుధవారం స్టేషన్‌కు పిలిపించారు. అతని వెంట అదే గ్రామానికి చెందిన ఎంచర్ల సత్యనారాయణ మద్యం సేవించి వచ్చాడు. అక్కడ విధి నిర్వహణలో ఉన్న ఎస్‌ఐని బూతులు తిట్టాడు. ఏఎస్‌ఐ శ్రీనివాస్ ఆపడానికి వెళ్తే అతడిని కూడా బెదిరించినందుకు సత్యనారాయణపై కేసు నమోదు చేశారు.

స్వగ్రామానికి రవి మృతదేహం



గొడ్డాటి రవి(ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): మండల పరిధిలోని గుండారం గ్రామానికి చెందిన గొడ్డేటి రవి(46) శనివారం చికిత్స పొందుతూ కువైట్‌లో మృతి చెందగా, బుధవారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. కుటుంబ సభ్యులు, స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. రవి 16 సంవత్సరాలుగా కువైట్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. గత ఆగస్టులోనే స్వగ్రామానికి వచ్చి తిరిగి కువైట్ వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కిందపడగా, ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడున్నారు. ఉపాధి కోసం వెళ్లి విగతజీవిగా రావడంతో కుటుంబసభ్యులు విలపిస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

డ్రైవర్ మృతి.. మరొకరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

సదాశివపేట (సంగారెడ్డి): కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం .. బీదర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు బుధవారం ఓ కారు బయలుదేరింది. సదాశివపేట పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డులో హిందూ శ్మశాన వాటిక సమీపంలోని డివైడర్‌ను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న ఉప్పరి నగేష్(28), పాండిచ్చేరి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కృష్ణమూర్తిలకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలంలో ఉన్న కొందరు 108కు కాల్ చేశారు. సంగారెడ్డి ఆస్పత్రికి ఇద్దరిని తరలిస్తుండగా, మార్గమధ్యలో నగేష్ మృతి చెందాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో కృష్ణమూర్తిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు నగేస్ స్వస్థలంబీదర్ పట్టణ పరిధిలోని మైలూరు స్వగ్రామం. ట్రావెల్స్‌కు సంబంధించిన వాహనాలు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గాయపడిన కృష్ణమూర్తిది చెన్నై సమీపంలోని రాలు గ్రామం. కృష్ణమూర్తి నగేష్ స్నేహితుడి తండ్రి కావడంతో తన కారులో తీసుకెళ్లాడు. నగేష్ బాబాయి విజయప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సంగారెడ్డి ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం తర్వాత నగేష్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ ప్రమాదంతో జాతీయరహదారిపై గంటకు పైగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.

వాహనం బోల్తా



కొల్చారం(నర్సాపూర్): ఐస్ క్యూబ్స్‌తో వెళుతున్న ఓ టాటా ఏస్ వాహనం అదుపు తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాజు తన వ్యాన్‌లో హైదరాబాద్ నుంచి ఐస్ క్యూబ్స్ వేసుకుని బుధవారం మెదక్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో జోరువాన పడుతుండడంతో మెదక్– నర్సాపూర్ రహదారిలో లోతువాగు మూలమలుపు వద్దకు రాగానే వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అటువైపుగా వెళుతున్న వాహనదారులు చిక్కుకున్న రాజును బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ఎడమ చేయి మణికట్టు వద్ద విరిగినట్టు బాధితుడు తెలిపాడు. చికిత్స నిమిత్తం మెదక్ ఆసుపత్రికి తరలించారు.

జొన్నల లోడు లారీ బోల్తా

చేగుంట(తూప్రాన్): జొన్నల లోడుతో వెళుతున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ సంఘటన చేగుంట శివారులోని 44వ జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..నిజామాబాద్ వైపునుంచి హైదరాబాద్ వైపునకు జొన్నల లోడుతో వెళుతున్న లారీ టైర్లకు ప్రమాదశాత్తు మంటలు అంటుకోవడంతో లారీ పడిపోయింది. ఈ ఘటనలో రోడ్డుపై జొన్నల బస్తాలు పడిపోవడంతో స్థానికులు, పోలీసులు మరో లారీలోకి లోడ్ చేయించారు. పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందిని తొలగించారు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలైనట్టు పోలీసులు తెలిపారు.

బీసీలు అన్నిరంగాల్లో ఎదగాలి



మాట్లాడుతున్న మురళీయాదవ్

కంది(సంగారెడ్డి): బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా సామాజికపరంగా అన్ని రంగాల్లో ఎదగాల్సిన అవసరం ఉందని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ అన్నారు. బుధవారం కందిలో ఉమ్మడి మెదక్ జిల్లా బీసీ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీయాదవ్ మాట్లాడుతూ జనాభాలో అధికంగా ఉన్న బీసీలకు రాజకీయాల్లో అన్ని పార్టీలు తగిన ప్రాధాన్యం కల్పించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి బీరయ్యయాదవ్ మాట్లాడుతూ ఈ బీసీ సమ్మేళనం ఏపార్టీకి వ్యతిరేకం కాదన్నారు. అన్ని పార్టీల్లో ఉన్న బీసీ నాయకులందరూ పరస్పరం సహకరించుకోవాలన్నారు. అనంతరం ఓబీసీ ఎంప్లాయిస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తాటిపల్లి పాండు పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో బీసీలకు నాలుగు ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానం కేటాయించడంతో పాటు ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ పదవుల్లో సగం స్థానాలను భర్తీ చేయాలని తీర్మానించారు. ఈ సమ్మేళనంలో నేతలు ప్రకాష్‌రావు, నందీశ్వర్‌గౌడ్, కొమ్మూరి ప్రకాష్, యాదగిరి, సత్తయ్యయాదవ్, పోచారం రాములు, ఆంజనేయులు, పులిమామిడిరాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



కమలమ్మ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): మండల పరిధిలోని తున్కిఖాల్సాకు చెందిన ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... తున్కిఖాల్సాకు చెందిన పడమటి కమలమ్మ (65) గురువారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం వర్గల్ సరస్వతి ఆలయానికి వెళ్లింది. ఆ తర్వాత ఆమె ఆచూకీ తెలియకుండా పోయింది. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినా జాడ తెలియలేదు. దీంతో ఆమె కొడుకు తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

షాపింగ్ మాల్‌కు జరిమానా

సిద్దిపేటజోన్: మున్సిపల్ నిబంధనలు అతిక్రమించిన పట్టణంలోని ఓ షాపింగ్ మాల్‌కు మున్సిపల్ అధికారులు బుధవారం రాత్రి జరిమానా విధించారు. వ్యర్థాలతో పరిశుభ్రతకు విఘాతం కలిగిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ సంపత్ సూచన మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్ రూ.15000 జరిమానా విధించారు.

రోనాల్డ్ రాస్ బాధ్యతల స్వీకరణ

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా రోనాల్డ్ రాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు సచివాలయంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా వివిధ విభాగాల అధికారులు లోకేశ్‌కుమార్‌కు వీడ్కోలు, రోనాల్డ్ రాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో అడిషనల్ కమిషనర్లు ప్రియాంక అలా, వి.కృష్ణ, సరోజ, విజయలక్ష్మి, జయరాజ్ కెనెడీ, జోనల్ కమిషనర్లు మమత, పంకజ, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, ఈఎన్‌సీ జియావుద్దీన్ ఉన్నారు.

రెండు బైకులు ఢీ

వ్యక్తికి తీవ్ర గాయాలు

కొల్చారం(నర్సాపూర్): ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కౌడిపల్లి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన తోంద్రు నాగరాజు తన బైక్‌పై రంగంపేట నుంచి స్వగ్రామమైన వెంకటాపూర్‌కు వస్తున్నాడు. ఇదే సమయంలో రంగంపేటకు చెందిన సాయిలు గ్రామ సమీపంలోని టీ కొట్టు వద్ద టీ తాగి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో నాగరాజు తన బైక్‌పై అతి వేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న సాయిలు బైకును ఢీ కొట్టి రోడ్డుపై పడ్డాడు. దీంతో నాగరాజు తలకు తీవ్ర గాయాలు కాగా, అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నాగరాజు

నక్కను రక్షించిన అటవీ అధికారులు

నంగునూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు బావిలో పడ్డ నక్కను ఫారెస్ట్ అధికారులు రక్షించి అడవిలో వదిలారు. బుధవారం రాంపూర్ గ్రామానికి చెందిన అనగోని ఎల్లయ్య వ్యవసాయ బావిలో నక్క పడ్డట్టు గుర్తించిన గ్రామస్తులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న బీట్ ఆఫీసర్ రవికిరణ్, సురేశ్ తాళ్ల సహాయంతో నక్కను బయటకు తీసి అడవిలో వదిలిపెట్టారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

కడుపునొప్పి భరించలేక...



చింతల మల్లేశం (ఫైల్)

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామానికి చెందిన చింతల మల్లేశం (38) వ్యవసాయం చేస్తున్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నా కడుపునొప్పి తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం మధ్యాహ్నం బావి దగ్గరకు వెళుతున్నానని ఇంట్లో చెప్పాడు. కాసేపటికి గ్రామానికి చెందిన పయ్యావుల మల్లేశం ఫోన్ చేసి చింతల మల్లేశం కుటుంబ సభ్యులకు బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పాడు. దీంతో కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి చూడగా చెట్టుకు వేళాడుతూ కనిపించాడు. మృతుడి భార్య బాలలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

యువకుడు..

కల్హేర్(నారాయణఖేడ్): ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నిజాంపేట మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్(23) హైదరాబాద్‌లో మేస్త్రీ పనిచేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. బుధవారం ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు మాత్రం తెలియరాలేదు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

గ్రానైట్ వ్యాపారులను టార్గెట్ చేసి...

జహీరాబాద్ టౌన్: సైబర్ కేటుగాళ్లు జహీరాబాద్‌లోని గ్రానైట్ వ్యాపారులను టార్గెట్ చేసి నేరాలకు పాల్పడుతున్నారు. బుధవారం పట్టణంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తి ఓ గ్రానైట్ వ్యాపారికి ఫోన్ చేసి సుభాష్‌గంజ్‌లో గల ప్రభుత్వ పాఠశాలకు గ్రానైట్ రాళ్లు పంపాలని కోరాడు. ఫోన్‌లోనే రేటు మాట్లాడుకున్నాడు. నిజమేననుకుని సదరు వ్యాపారి వాహనంలో గ్రానైట్ తీసుకెళ్లి.. ఫోన్ చేసిన వ్యక్తి గురించి ఆరా తీయగా అతను కనిపించలేదు. వచ్చిన నంబర్‌కు వ్యాపారి ఫోన్ చేయగా.. నేను టౌన్ బయట ఉన్నాను... మీ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది, ఆ నంబర్ చెబుతే డబ్బులు వేస్తానని చెప్పాడు. నమ్మిన వ్యాపారి ఓటీపీ చెప్పి డబ్బులు పోగొట్టుకున్నాడు.

- మరో గ్రానైట్ వ్యాపారికి గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. ఆయన కూడా గ్రానైట్ నింపుకుని పాఠశాలకు వెళ్లగా ఆర్డర్ ఇచ్చిన వ్యక్తి కనిపించలేదు. ఓటీపీ చెబితే డబ్బులు వేస్తాననడంతో అనుమానం వచ్చి ఫోన్‌లోనే నిలదీయగా సైబర్ నేరస్తుడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు.



ప్రైవేట్ ఉద్యోగిని..

పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో పడి ఓ ప్రైవేట్ ఉద్యోగిని రూ.9.85 లక్షలు నష్టపోయింది. అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులురెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలో లక్ష్మిసాయి మిడోస్ కాలనీలో ఉండే ఓ ప్రైవేటు ఉద్యోగురాలికి ఏప్రిల్ 30వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం అంటూ మొబైల్‌కు ఓ మెసేజ్ వచ్చింది. మెసేజ్ ఓపెన్ చేసి వివరాలు నమోదు చేసి పలు దఫాలుగా రూ.9.85 లక్షలు డబ్బులు చెల్లించి, ఇచ్చిన టాస్కులు పూర్తి చేసింది. పెట్టిన నగదుతో పాటు రెట్టింపు నగదు ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితురాలు తాను మోసపోయినట్టు గుర్తించి జూన్ 19వ తేదీన సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుధవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.